01ATP05_01ATP05.qxd 05-11-2022 PM 10:28 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 06 నవంబర్ 2022 పేజీలు : 04


# విద్యార్థులకు పాఠాలు చెప్పిన మంత్రి

-కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఎదగాలని ఆకాంక్ష
-కె.సి, ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్

**కళ్యాణదుర్గం-ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ఇంగ్లీష బోధన ప్రవేశపెట్టిందని, కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఎదగాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అకస్మికెంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అరవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషులో పాఠ్యాంశాలు బోధించారు. సైన్సులో స్పేస్ గురించి ప్లానెట్‌ల గురించి, సాంఘిక శాస్త్రంలో పలు ముఖ్యపట్టణాల రాజధానుల గురించి ప్రశ్నించినపుడు విద్యార్థులు చురుకుగా సమాధానాలు చెప్పడంతో మంత్రి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషుమీడియం బోధన ప్రవేశపెట్టి, అందరితో సమానంగా విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా పుస్తకాలతో పాటు యూనిఫాంలు, అర్థిక ప్రోత్సాహాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ సౌకర్యాలకు విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలకు వెళ్లి అహార తయారీని పరిశీలించారు. భోజనంలో వడ్డించే సాంబారులో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పప్పుధాన్యాలు, అకుకూరలు, కూరగాయాలు వేసారా..? మంచి ప్రొటీన్లు అందేలా అహారాన్ని తయారు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యాహ్నభోజన ఏజెన్సీ వారికి వంటలో మంచి ప్రావీణ్యం ఉందని, అహారాన్ని రుచిగా తయారు చేస్తారని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- ఫలించిన జీవానందరెడ్డి కృషి - వైద్య శిబిరానికి భారీగా జనం హాజరు



నాగసముద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, గ్రామస్తులు సన్మానిస్తున్న దృశ్యం, విలేకర్లతో మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

**అనంతపురం, నవంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో**

పిజెఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి నేతృత్వంలో శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి వైద్య చికిత్సలు చేయించుకోవడం విశేషం. వైద్య శిబిరానికి భారీ స్పందన రావడంతో పెరుమాళ్ల జీవానందరెడ్డి కృషి ఫలించింది. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామంలో పిజెఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 500 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. నాగసముద్రం చుట్టూ ఉన్న దాదాపు 15 గ్రామాలప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కర్నూలులోని అమీలియా ఆసుపత్రిసహకారంతో నాగసముద్రంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో నిర్వహకులు ఆనందానికి గురయ్యారు. వైద్య శిబిరం సందర్భంగా పెరుమాళ్ల జీవానందరెడ్డిని స్థానిక గ్రామ ప్రజలు శాలువాతో సన్మానించి ఆయన చేస్తున్న మంచి పనులను కొనియాడారు. వైద్య శిబిరం సందర్భంగా హాజరైన గ్రామీణ ప్రజలతో పెరుమాళ్ల జీవానందరెడ్డి ఆప్యాయంగా మాట్లాడి అధైర్య పడకండి వైద్యం కోసం అవసరమైతే కర్నూలు అమీలీయో ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తానని జీవానందరెడ్డి హామీ ఇవ్వడంతో రోగులు ఆనందానికి గురయ్యారు.

### ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు : జీవానందరెడ్డి

వైద్య శిబిరం ఏర్పాటు సందర్భంగా పిజెఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ.. నాలుగేళ్లు అయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలు చూసేందుకు జనంలోకి రావడం లేదని, ప్రజల ఇక్కట్లను పట్టించుకోలేదన్నారు. ఆరోగ్య సమస్యలతో ప్రజలు పడుతున్న ఇక్కట్లు అనేకం ఉన్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి అందరికీ ముద్దులు పెట్టి, కులం చూడను, మతం చూడను అంటూ ఒక్క ఛాన్స్ ఇవ్వండని ప్రజలను కోరగా ప్రజలు అవకాశం ఇస్తే వారికి ఏం చేశావని ఆయన ప్రశ్నించారు. వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని భారీగా ప్రచారంచేసుకున్నావ్.. భారీగా మాటలు చెప్పావు.. అయితే ఆచరణలో అమలు అవుతోందా.. అని ఆయన ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ అమలు కాకపోవడంతో లక్షలు లక్షలు ఖర్చు పెట్టుకున్న వారు ఎందరో ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ అమల్లో అనేక సమస్యలు తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ఆయన ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ అమలు చేసినప్పుడు ఒక ఆసుపత్రిలో ఫెయిల్ అయితే మరొక ఆసుపత్రిలో అప్లై చేస్తే అది అమలు కావడం లేదని, తద్వారా సామాన్య ప్రజలు లక్షలకు లక్షలు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ అమలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు ఎందుకు తీర్చడం లేదని ఆయన ప్రశ్నించారు. గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటితో ప్రజలు ఇబ్బంది పడతున్నారని కిడ్నీ సమస్యలు, కలుషిత నీటి వల్ల మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని ఇలాంటి ఆరోగ్య సమస్యలను ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ప్రజల సగటు ఆదాయం రోజుకు 250 నుంచి 300 ఉంటోందని, పెరిగిన ధరల వల్ల సగటున ప్రతి మనిషి ఖర్చు దాదాపు 100 అవుతుందని రోజుకు 100 రూపాయలు ఒక్కొక్కరు అప్పు చేయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితులపై ప్రజలపై భారం పడుతుంటే.. ఆరోగ్యసమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రులచుట్టూ తిరిగి వారుపడుతున్న అవస్థలు వర్ణనాతీతం అన్నారు. అందుకే ఆరోగ్య శ్రీ వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించానన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే ఆ పథకాల అమలులో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించినపుడు సంక్షేమ పథకాలు అమలులో ఫీల్డ్‌లో సమస్యలు ఉన్నట్లు గుర్తించానని, ఏదో ఒక కారణంతో సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పట్టించు కోవడం లేదు, నాయకులు పట్టించు కోలేదన్నారు. కొంత మంది నాయకులు స్వలాభం కోసం ప్రయత్నిస్తున్నారు కానీ ప్రజల సమస్యలు పట్టించు కోవడం లేదన్నారు. ఎన్నికల్లో డబ్బులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలకు సేవలు అందించే మంచి వారికే ఓట్లు వేసేందుకు ప్రజలు కూడా మారాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారం ఉందికదా అని యదేచ్ఛగా అవినీతి, అక్రమాలకు పాల్పడే వారికి ఓటు హక్కు ద్వారా బుద్ధి చెప్పి మంచి వారిని, సమాజ సేవకులను ఎన్నుకోవాలని ఆయన ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేత వెంకట శివుడు యాదవ్, టీడీపీ అనంతపురం డాక్టర్‌సెల్ అధ్యక్షులు హిమబిందు, టీడీపీ గుంతకల్లు పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, పామిడి టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, పామిడి మండల జడ్పిటిసి లక్ష్మీకాంతమ్మ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొట్టు శ్రీనివాసరెడ్డి, మాజీమార్కెట్‌యార్డు చైర్మన్‌ప్రభాకర్ చౌదరి, తెలుగు యువత జిల్లాప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, మాజీ ఎంపిటిసి జింకల సంజీవకుమార్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోపలువురు మాజీ జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మండల, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే సీఎం జగన్ ఆకాంక్ష

- నగరానికి ధీటుగా రూరల్ పంచాయితీల అభివృద్ధి
- ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై కుట్రలు, కుతంత్రాలా..?
- అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంటరామిరెడ్డి



వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్‌లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత



సచివాలయ ప్రారంబ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి తలారి రంగయ్య

**అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షగా సుపరిపాలనను కొనసాగిస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్ పంచాయితీలో శనివారం వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ ప్రారంభం గ్రామ సచివాలయ ప్రారంభం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, జడ్పి చైర్మన్‌బోయ గిరిజమ్మలతో కలిసి హాజరై ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచు ఉదయ్‌శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో రావాలి జగన్.. కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగామీ ముందుకు వచ్చినప్పుడు రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తే చాలని తన దృష్టికి తీసుకొచ్చారని, ప్రతిఇంటిముంగిట రోడ్లు, డ్రైనేజీలు వేయిస్తామని, తాము ఇచ్చిన మాటను విశ్వసించి మీ రంతామమల్ని ఆదరించారన్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మూడేళ్ల పాలనలోనే రూరల్‌పంచాయితీలోని 25 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మీకిచ్చిన మాటను నిలుపుకున్నామన్నారు. దాదాపు 90 శాతం రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేశామని మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయిస్తామని భరోసా కల్పించారు. అంతేకాకుండా నగరానికి ధీటుగా అనంతపురం రూరల్‌పంచాయితీని ఆదర్శ పంచాయితీగా తీర్చి దిద్దుతున్నామన్నారు. పంచాయితీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటి సమస్య అధికంగా ఉందని శుద్ధ జలాన్ని అన్ని ప్రాంతాల్లో అందించేందుకై కృషిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఎంపి తలారి రంగయ్య నిధుల నుంచి జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ జిల్లా పరిషత్ గ్రాంట్ నుంచి అదే విధంగా మండల పరిషత్ గ్రాంట్ల నుంచి ప్రత్యేకంగా నిధులను విడుదల చేయించి మూడు స్టోరేజ్ ట్యాంకులను నిర్మించి శుద్ధ జలాన్ని అందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ముఖ్యమంత్రి దిగిపోవాలని రాద్ధాంతాలు చేస్తున్నాయని, ప్రజలకు మేలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి దిగిపోవాలా అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్న చంద్రబాబునాయుడు పొరపాటునమీరు అధికారంఓలకి వస్తున్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ధైర్యంగాచెప్పగలరా అని ప్రశ్నించారు. మీకోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి మీరు తోడుగానిలబడాలని ఆయన సూచిచారు. పార్లమెంట్ సభ్యులు తలారిరంగయ్య మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతోందన్నారు. గతంలో ఉన్న పాలకులు ఎన్నో హామీలను ఇచ్చినా ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారన్నారు. అందుకు భిన్నంగా నేడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకంలో 9 హామీలను ఇచ్చి నేడు మూడేళ్ల పాలనలోనే చెప్పిన వాటికంటే అధికంగా 13 పథకాలను అందిస్తున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నిలవాలని సూచించారు. జడ్పి చైర్మన్ బోయగిరిజమ్మ మాట్లాడుతూ.. పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరించి అవినీతికి ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. నేడు ముఖ్యమంత్రి అవినీతి రహిత పాలనను అందించేందుకై వార్డు వాలెంటీర్లు, సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి ఎవరి ప్రమేయం లేకుండానే నేరుగా ప్రజల ముంగిటకే పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ జడ్పి భాగ్యరాజ్, డిఇ కాటంరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపిపి వరలక్ష్మి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌ఓబిరెడ్డి, ఉపసర్పంచు సుమిత్ర, ఎంపిటిసిలు ఆదినారాయణమ్మ, ఆశాజ్యోతి, సీనియర్‌నేతలు అనంత చంద్రారెడ్డి, జయరామ్‌నాయుడు, పోతులయ్య, డిసి రమేష్‌గౌడ్, నాగార్జునరెడ్డి, నగేష్, సుధాకర్‌రెడ్డి, చంద్ర, రంగారెడ్డి, ఎంపిడిఓ బాబాఫక్రుద్దీన్, పంచాయితీ కార్యదర్శి ముత్యాలు రెడ్డి, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు విశేష స్పందన



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

**కణేకల్లు, నవంబర్ 5 ప్రభాతవార్త**

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్ కాపు రామచంద్రారెడ్డి కణేకల్లు మేజర్ గ్రామ పంచాయితీలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను గడపగడపకు వెళ్లి ఆయన అందజేశారు. పాత పోలీస్‌స్టేషన్ దగ్గర కటిగా వీధి దగ్గర నుంచి శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌ఱెడ్డి నేతృత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సుపరిపాలన పాల్పడిందన్నారు. రైతు, మహిళ, విద్యార్థి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది అన్నారు. భారతదేశంలోనే రాష్ట్రంలో అందుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల పాలకులు సైతం మెచ్చుకుంటున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి 30 సంవత్సరాలు పాటు రాష్ట్రంలో కొనసాగాలని రాబోవు ఎన్నికల్లో వైసీపీ పార్టీని ఆదరించాలని గడపగడపకు వెళ్తూ ప్రజల్ని ఆయన కోరారు. కణేకల్ వైసీపీ పట్టణ కన్వీనర్ తిమ్మ సముద్రం కేశవరెడ్డి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, మాజీ జడ్పిటిసి పాటిల్ నాగిరెడ్డి, జడ్పిటిసి పద్మావతి, ఎంపిపి సంధ్య, వైస్ ఎంపిపి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మారంపల్లి మారన్న, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆ వార్డెన్ మొదటి నుంచి వివాదస్పదమే..!

- ఉన్నతాధికారుల పట్ల కూడా దురుసు ప్రవర్తన - పలు సంఖ్యలో మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ
- తాజాగా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**

ఆమె ఒక బాధ్యతగల స్థానంలో వుంది. కానీ ఆ బాధ్యతను మరిచి ప్రవర్తిస్తుంది. ఉన్నతాధికారుల అంటే గౌరవం లేదు. పైగా దురుస ప్రవర్తన కూడా. పద్ధతిని మార్చు కోవాలని ఉన్నతాధికారులు పలు మార్లు మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. తాజాగా ఆ వార్డెన్‌ను సస్పెన్షన్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లా బీసీ సంక్షేమ శాఖలో జి.సరస్వతి అనే మహిళ 2012 జనవరి 18న వార్డెన్‌గా ఉద్యోగం పొంది మొట్ట మొదటిగా హిందూపురం బీసీ కళాశాల్లో హాస్టల్లో ఉద్యోగంలో చేరింది. ఆ తర్వాత పెనుకొండ బీసీ కళాశాల హాస్టల్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న సమయంలో విద్యార్థులకు సరైన భోజనం పెట్టకుండా, ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కలిసి సబ్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది. అప్పట్లో ఆ శాఖ ఉన్నతాధికారులు తన పద్ధతిని మార్చుకోవాలని మందలించారు. ఆ తర్వాత అక్కడ నుంచి తాడిపత్రి ఏబీసీడబ్ల్యూవో పరిధిలో ఉన్న అనంతపురంలోని పాతూరు మార్కెట్ పక్కన ఉన్న శింగనమల బీసీ బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్‌గా బదిలీ అయ్యారు. అక్కడ కూడా విద్యార్థులకు భోజనం సరిగా పెట్టకపోవడం, విద్యార్థులను ఇష్టానుసారంగా తిడుతుంటే విద్యార్థులు పాతూరులోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేయడం జరిగింది. అప్పుడు ఆమె విద్యార్థులపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసులు కూడా పెట్టడం జరిగింది. ఈ విషయం అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా జెసి లక్ష్మీకాంతం దృష్టికి వెళ్ళడంతో వెంటనే ఆ వార్డెన్‌ను సస్పెండ్ చేయడానికి ఫైల్ పంపాలని అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ ఐ.ఆర్.రమాభార్గవిని ఆదేశించారు. అప్పుడు డీడీ ఆ వార్డెన్ పరిస్థితిని తెలుసుకొని చర్యలు వద్దని జెసికి సర్దిచెప్పడంతో అప్పుడు ఆ వార్డెన్‌ను శింగనమల బీసీ బాలికల కళాశాల హాస్టల్‌కు బదిలీ చేయడం జరిగింది. అప్పుడు ఆ బదిలీ ఆర్డర్ కాపీ తీసుకోకుండా ఆమె తన తల్లితో కలిసి డీడీ ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది. తర్వాత మళ్ళీ జాయిన్ అయ్యింది. రెండు నెలలు తర్వాత ఆమెను మళ్ళీ శింగనమల బీసీ బాలుర కళాశాల హాస్టల్‌కు బదిలీ చేశారు. అక్కడ హాస్టల్లో గదులను, మరుగుదొడ్లను శుభ్రం చేయించకుండా గాలికి వదిలేయడంతో అక్కడ ట్రాక్టర్ల కొద్ది చెత్తతో హాస్టల్ నిండిపోయింది. దుర్వసన వస్తున్నప్పటికీ, దాని వలన విద్యార్థులు బాధపడుతున్నప్పటికీ దాదాపు మూడున్నరేళ్లుగా వాటిని శుభ్రం చేయించకపోవడం ఆమె నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆఖరికి ఆ బిల్డింగ్ ఓనర్ స్పందించి తాను చెత్తను శుభ్రం చేయిస్తానని ముందుకు వచ్చినప్పటికీ అతన్ని కూడా హాస్టల్ లోపలికి రానీయకుండా అడ్డుకోవడం జరిగిందని ఆ ఓనరే చెబుతున్నారు. అంతే కాకుండా తాజాగా జరిగిన బదిలీల్లో ఆ వార్డెన్‌ను కదిరి బీసీ కళాశాల బాయ్స్ హాస్టల్‌కు బదిలీ చేశారు. అక్కడ కూడా ఆ వార్డెన్ విద్యార్థులకు భోజనం సరిగా పెట్టకపోవడం, విద్యార్థులను ఇష్టానుసారంగా మాట్లాడుతుందని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేయడం చేయడం జరిగింది. ఆ వార్డెన్ మాకొద్దని డిమాండ్ చేయడం జరిగింది. ఈ విషయం ఏబీసీడబ్ల్యూవో ద్వారా శ్రీ సత్యసాయి జిల్లా డీబీసీడబ్ల్యూవో దృష్టికి వెళ్ళిడంతో వెంటనే కదిరి ఏబీసీడబ్ల్యూవో ఆఫీస్‌కు చేరుకుని వార్డెన్ ప్రవర్తన గురించి డీబీసీడబ్ల్యూవో తెలుసు కుంటుండగా...డీబీసీడబ్ల్యూవో, ఏబీసీడబ్ల్యూవో ఎదురుగా ఉండగానే తనకు ఏ హాస్టల్ వద్దని తాళాలు విసిరేసి అక్కడ నుంచి వెళ్ళిపోయింది. దీంతో ఆమె హాస్టల్ బాధ్యతలను మరొక వార్డెన్‌కు తాత్కాలికంగా అప్పగించడం జరిగింది. ఆ తర్వాత ఆమె తనను ఉన్నతాధికారులు అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు తప్పుడు ఆరోపణలతో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా ఏబీసీడబ్ల్యూవో ఆఫీస్ ముందు తన తల్లితో కలిసి ధర్నా చేయడం జరిగింది. ఆమె కదిరిలోనే వుంటే సమస్యలు ఎక్కువ అవుతాయని అధికారులు ఆలోచనన చేసి ఆమెను అక్కడ నుంచి బుక్కపట్నం బీసీ బాలుర కళాశాల హాస్టల్‌కు బదిలీ చేయడం జరిగింది. అయితే ఆమె విధుల్లో చేరలేదు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా మెడికల్ లీవ్‌లో వెళ్తున్నట్లు డీబీసీడబ్ల్యూవో ఆఫీస్‌లో లెటర్‌ను ఇచ్చి వెళ్ళడం జరిగింది. ఆ లెటర్‌కు ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్లు జతపరచలేదు. దీంతో ధర్మవరం ఏబీసీడబ్ల్యూవో ఆమె బుక్కపట్నంలో జాయిన్ కాలేదని డీబీసీడబ్ల్యూవోకు రిపోర్టును అందజేశారు. అదే రిపోర్టును కలెక్టర్‌కు పంపగా...ఆ వార్డెన్‌ను అక్టోబర్ 18న సస్పెన్షన్ చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై తాజాగా విచారణ కూడా జరిగింది. ఆ విచారణ జరిగిన రోజు కూడా ఆమె విచారణ అధికారులకు సరిగా సహకరించకుండా అధికారులను, సాటి వార్డెన్లను దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. అయితే ఇంతటి వివాదస్పదమైన ఆ వార్డెన్‌పై ఉన్నతాధికారులు ఇంకా ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారోనని బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.



వార్డెన్ జి.సరస్వతిని సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

### ఆ వార్డెన్ జాయిన్ కాకపోవడంతోనే సస్పెన్షన్ అయ్యారు: శ్రీ సత్యసాయి జిల్లా డీబీసీడబ్ల్యూవో నిర్మల జ్యోతి

ఇటీవల కదిరి బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న జి.సరస్వతిని పలు కారణాల వలన బుక్కపట్నం బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌కు బదిలీ చేయడం జరిగింది. ఆమె ఎన్ని రోజులు అయినా కూడా జాయిన్ కాకపోవడంతో జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. దీనిపై విచారణ వేయడం జరిగింది. ఆ విచారణ నివేదిక ఆధారంగా ఆమెపై తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

# ప్రతి పేదవానికి శాశ్వత గృహం అందించడమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయం

**కదిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి నిరుపేదకు శాశ్వత గృహాన్ని నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో కృషి చేస్తున్నారని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్ నాగరాజు, కదిరి నియోజకవర్గ హౌసింగ్ ఇంజనీర్లు తహశీల్దార్‌లు ఈఓఆర్డీలతో హౌసింగ్ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి విఆర్ఓల ద్వారా పోజిషన్ సర్టిఫికెట్ స అందించడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సర్టిఫికెట్‌ను పరిశీలించిన పిమ్మట వెంటనే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను పంపాలని అక్కడ నుండి హౌసింగ్ శాఖ లాగిన్‌కు వెళ్లేలా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. పరిశీలన అనంతరం వేగవంతంగా ఇంటి మంజూరు ప్రతాలను లబ్ధిదారులకు అందజేయాలని తెలిపారు. ఒక వారం రోజుల అనంతరం మరొకసారి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అంతకు లోపు హౌసింగ్ సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో తీసురావాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజిమున్నిసాసాదిక్, ఎంపిపి తోట అమరా నాథ్‌రెడ్డి, జడ్పిటిసి రాధాబాయి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



హౌసింగ్ అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

02ATP27_02ATP27.qxd 05-11-2022 PM 09:59 Page 1



## అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దుదాం


మాట్లాడుతున్న అధికారులు

హిందూపురం టౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త : భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ బాలసత్యనారాయణ, ఎఎస్‌పి సరోజ్ కుమార్‌సింగ్ తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతిని నిర్మూలించాలని దాని కొరకు ప్రతి భారతీయుడు జవాబుదారి తనంతో మెలగాలన్నారు. ఉద్యోగులు విధుల్లో నిబద్ధతతో పనిచేయాలన్నారు. అవినీతికి తావు లేకుండా ఉత్తమసేవలు అందించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా అవినీతి రహిత భారతం గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఆర్థిక చేయూత


క్రీడాకారులకు చెక్కు అందచేస్తున్న వేణు

పరిగి, నవంబర్ 5 ప్రభాతవార్త : జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వేణుగోపాలరావు శనివారం 12 వేల రూపాయల చెక్కును అందచేశారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్ఐ నరేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సమస్యలు వేగవంతంగా పరిష్కరించండి


పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి రామకృష్ణ

హిందూపురం, నవంబర్ 5 ప్రభాతవార్త : పోలీసుస్టేషన్లకు వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అదనపు ఎస్‌పి రామకృష్ణప్రసాద్ సూచించారు. శనివారం ఆయన హిందూపురం ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇటీవల హిందూపురం ఒకటవ పట్టణ సిఐ ఇస్మాయిల్ దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ గత కొన్ని రోజులుగా న్యాయవాదులు చేస్తున్న నిరసనలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరిగిన ఘటనలను దృష్టిలో వుంచుకుని అప్రమత్తంగా వుండాలని, క్రైంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం ఆయన స్టేషన్‌లో రికార్డులు, సిసి కెమెరాలు, స్టేషన్ పరిసరాల్లోని వాహనాలను పరిశీలించారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు రుద్రప్పకు ఘన నివాళి


రుద్రప్ప చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉదయ్, తదితరులు

హిందూపురం టౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధుడు బోయ చెట్ల రుద్రప్ప (105) అనారోగ్యంతో శుక్రవారం కళ్యాణదుర్గంలో కన్నుమూశారు. రుద్రప్ప మృతిపై లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉదయ్‌కుమార్, ప్రజా సంఘాలు శనివారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కల్లూరు సుబ్బారావు, తరిమెల నాగిరెడ్డి, ఓబన్నలతో కలిసి రుద్రప్ప ఉద్యమంలో పాల్గొన్నారని ఇటీవల స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుకుంటూ హిందూపురంలో ఇటీవల జరిగిన సన్మాన కార్యక్రమంలో రుద్రప్పను సన్మానించినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రహమత్, నాగార్జున, మురళి, గంగాధర్, పాల్గొన్నారు.

## నాడు - నేడు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చిలమత్తూరు, నవంబర్ 5 ప్రభాతవార్త : మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని బ్రహ్మేశ్వరంపల్లి లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నాడు - నేడు పనులను సర్పంచు ఈడిగ తిరుమలేష్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా భవనాల మరమ్మతులు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పెయింటింగ్, తదితర పనుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల రూపాయలు కేటాయించిందని సర్పంచు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌నారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న క్రీడా సంబరాల కోసం రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

-నవంబర్-7,6,9తేదిల్లో సెలక్షన్లు

-క్రీడా సంబరాల కో-ఆర్డినేటర్ కిరణ్‌చౌదరి


జగనన్న క్రీడాసంబరాల కో-ఆర్డినేటర్ కిరణ్‌చౌదరి

కళ్యాణదుర్గం- ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఉత్తర్వుల మేరకు ప్రతి నియోజకవర్గంలోనూ ఈనెల 7,8,9 తేదీల్లో జగనన్న క్రీడా సంబరాల కోసం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు క్రీడా సంబరాలు కో-ఆర్డినేటర్ కిరణ్‌చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అందరు వ్యాయామోపాధ్యాయులు క్రీడా సెలెక్షన్ల కోసం పూర్వపు విద్యార్థులను పంపాలని విజ్ఞప్తి చేసారు. ఈ సెలెక్షన్లలో 17 సంవత్సరాలు పైబడిన పురుష,మహిళా క్రీడాకారులు మాత్రమే అర్హులని, ఈనెల 7వ తేది సోమవారం కబడ్డీ, 8వ తేదిన వాలీబాల్, 9వ తేదిన క్రికెట్ క్రీడల్లో సెలెక్షన్లు నిర్వహిస్తామన్నారు. సెలెక్షన్లలో పాల్గొనే విద్యార్థులు జగనన్న స్పోర్ట్స్ క్లబ్ అనే యాప్‌ను ప్లేస్టోర్‌లో డౌన్‌లోడు చేసుకుని,తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఇతర వివరాల కోసం సెల్ : 7989206010, 6300855638లను సంప్రతించాలని విజ్ఞప్తి చేసారు.

## ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదు గడువును పెంచాలి


గురజాయ అధ్యయన కేంద్ర సభ్యులు

కళ్యాణదుర్గం- ప్రభాతవార్త : పట్టభద్రుల శాసనమండలి గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు గడువును నవంబర్ నెలాఖరుల వరకూ పొడిగించాలని గురజాడ అధ్యయన కేంద్రం సభ్యులు చల్లా కిశోర్‌కుమార్‌చౌదరి, జర్నలిస్టు లింగప్రసాద్, ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఓబులరాజు, స్ఫూర్తి నరసింహులు తదితరులు ఎలెక్షన్ కమీషన్‌కు విజ్ఞప్తి చేసారు. రాయలసీమలో అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో చాలా మంది గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు కార్యక్రమం మందకొడిగా సాగుతోందని, పనిఒత్తిడిలోనూ, ఇతర కారణాలతో చాలా మంది ధరఖాస్తు చేసుకోలేకపోయారని, కనుక ఓటరు నమోదు గడువును ఈనెలాఖరుల వరకూ పొడిగించి,ఓటింగ్‌లో ఎక్కువ మంది విద్యావంతులు పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసారు.

## మానసిక వత్తిడికి గురికాకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి


వార్త సీనియర్ జర్నలిస్టు లింగ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న వార్త యూనిట్ బ్రాంచ్ మేనేజర్ తదితరులు

కళ్యాణదుర్గం, ప్రభాతవార్త : గుండె సంబంధిత చికిత్సలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మెడికేషన్‌లో సీనియర్ వార్త జర్నలిస్టు లింగప్రసాద్‌ను వార్త యూనిట్ మేనేజర్ మధుసూదన్, అడ్వటైజ్‌మెంటు మేనేజర్ శ్రీధర్‌లు పరామర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పాల్గొనేందుకు కళ్యాణదుర్గం వచ్చిన సందర్భంగా సీనియర్ జర్నలిస్టు లింగప్రసాద్ ఇంటికెళ్లి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వత్తిడికి గురికాకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ ప్రశాతంగా ఉండాలని, ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ విలేఖరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న పోలీసు వెంకటరాముడు


వానరానికి వైద్యునితో చికిత్స చేయిస్తున్న పోలీసులు

లేపాక్షి నవంబర్ 5 ప్రభాతవార్త : దయ, కరుణ, సత్యం, ధర్మం మంట కలిసిపోతున్న ఈ రోజుల్లో పోలీసు వెంకటరాముడు మానవత్వంతో ఆపదలో వున్న వానరాన్ని కాపాడేందుకు విశ్వప్రయత్నం చేసిన సంఘటన మండల కేంద్రమైన లేపాక్షిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే శుక్రవారం ఓ వానరం విద్యుత్‌షాక్‌కు గురైంది. అరకొర ప్రాణాలతో లేపాక్షి పోలీసుస్టేషన్ ఆవరణలో చలనం లేని స్థితిలో బిక్కు బిక్కుమంటూ ప్రాణాలు వదలలేక దయనీయ స్థితిలో ఓ మూలన కూర్చుని వుండిపోయింది. శుక్రవారం సాయంత్రం ఆ వానరాన్ని గమనించిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు కానిస్టేబుల్ జనార్ధన్‌లు రాత్రి ఆ వానరానికి ఆహారం ఇచ్చేందుకు విఫలయత్నం చేశారు. అయినా ఆ వానరం ఎలాంటి ఆహారం తీసుకోలేకపోయింది. శనివారం ఉదయం ఆ పోలీసులు వానరాన్ని పోలీసుస్టేషన్ నుండి లేపాక్షి పశువుల ఆసుపత్రికి తరలించారు. పశు వైద్యులు కిషోర్ వెంటనే వానరానికి వైద్య పరీక్షలు నిర్వహించి గ్లూకోజ్ ఎక్కించేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఆ వానరం ఎంతకీ స్పందించకపోవ డంతో అతికష్టం మీద ఆ వానరానికి గ్లూకోజ్ ఎక్కించారు. దాదాపు మూడు నాలుగుగంటలపాటు పలురకాల మందులను వేశారు.ఆసమయంలో మరిన్ని వానరాలు గమనించి తమమిత్రునికి ఏమోచేస్తున్నారన్న కోపంతో ఒక్కసారిగా మీద పడడంతో డాక్టర్‌తోపాటు అక్కడ వున్న వారందరూ పరుగులు తీశారు. ఆ తరువాత కొద్దిసేపటికి వానరం మృతి చెందింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, కానిస్టేబుల్ జనార్ధన్ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచు ఆదినారాయణతో చర్చించి పంచాయతీ కార్మికులను పిలిపించి వానరాన్ని ఖననం చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టారు.

## గృహాల మధ్య కారంపొడి, మసాలా పొడిపై ఫిర్యాదు


తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బెలుగుప్ప, నవంబర్ 5 ప్రభాతవార్త : మండల కేంద్రంలో మంజునాథ గుడి పక్కన ఉన్న కారంపొడి, మసాలా పొడి పిండి మిషన్‌పై మానవ హక్కుల పరిరక్షణ జిల్లా చైర్మన్ అధికారి ఓబులేసు, బెలుగుప్ప గ్రామానికి చెందిన మంజునాథ తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో అనుమతులు లేకుండా ప్రజల నివాసాల మధ్యలో ప్రజలందరికీ ఇబ్బందులకు గురి చేస్తూ.. ఆడించే మిషన్‌ను వెంటనే తీసి వేయాలని, రోడ్డుకు అడ్డంగా ప్రజలు ఎవరూ తిరగడానికి అవకాశం లేకుండా దౌర్జన్యంగా పిండి మిషన్‌ను నడుపుతున్న నటేష్‌ను వెంటనే రద్దు పరచాలని మంజునాథరెడ్డి తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల పరిరక్షణ చైర్మన్ జిల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఈ కారం పొడి మిషన్ వల్ల పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు అనారోగ్యాల పాలు అవుతున్నారని, ఈ కాలుష్యం వల్ల గాలి పీల్చుకుని తీవ్రమైన అస్వస్థలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరోణ సమితి రామాంజినేయులు, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం


ఓటరు నమోదు చేస్తున్న తేదేపా నాయకులు

గుడిబండ, నవంబర్ 5 ప్రభాతవార్త : మండలంలోని సిసి గిరి, జవనడుకు, మోపరగుండు, గ్రామాలలోని వైఎస్ఆర్‌సిపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఎంజారేగౌడ్, చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా 10 అప్లికేషన్లను తీసుకొని తహశీల్దారు కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. అలాగే వైకాపా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపుకు కృషి చేయాలని, వైకాపా శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో మందలపల్లి సింగిల్ విండో అధ్యక్షులుచంద్రశేఖర్, సర్పంచులు డిఎల్ యంజారేగౌడ్, లక్ష్మీనారాయణ, మడకశిర, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సురేష్, వైకాపా నాయకులు పిసి.గిరిచక్రవర్తి, గిరిధర్‌నాయక్, తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## నేటితరం యువతరానికి రుద్రప్ప ఆదర్శప్రాయుడు

- శెట్టూరులో కామ్రేడ్ రుద్రప్ప అంత్యక్రియలు


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శెట్టూరు, నవంబర్ 5 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సిపిఐ తొలితరం నాయకుడు కామ్రేడ్ రుద్రప్ప అంత్యక్రియలు శెట్టూరు మండల కేంద్రంలో శనివారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఊరి శివార్లలోని స్మశాన వాటికల్లో అంత్యక్రియలు పూర్తి చేశారు. కామ్రేడ్ రుద్రప్ప మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది సిపిఐ కార్యకర్తలు సానుబూతిపరులు వివిధ పార్టీల నాయకులు తరలివచ్చి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆరు దశాబ్దాలుగా రుద్రప్ప భారత కమ్యునిస్టు పార్టీలో సైనికుడిగా పనిచేస్తూ ఎందరో కార్యకర్తలను తయారు చేశారని, మరెందరో పేదలకు నివేధ స్థలాలు భూ పంపిణీ చేసిన మహనీయుడని కొనియాడారు. ఇలాంటి వ్యక్తిత్వం గల నాయకుని ఆశయ సాధన కోసం అనుసరించే విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సిద్ధాంతాలను తూచాతప్పకుండా పాటించాలని ప్రతిజ్ఞబూనారు. ఈ సందర్భంగా నాయకులు జోహార్లు అర్పించారు. రుద్రప్ప లేని లోటు భారత కమ్యునిస్టు పార్టీకి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తీర్చలేనిదని గుర్తు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, సిపిఐ సీనియర్ నేతలు ఎంవి.రమణ, లక్ష్మన్నలు తమ సంతాప సందేశాలను పంపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిలు మహాదేవ్, వై.గోపాల్, కుందుర్పి మాజీ ఎంపిపి గిరిజ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, కర్ణాటక చెల్లకెర తాలూకా సిపిఐ కార్యదర్శి కరియన్న, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్వరనాయుడు, వైసీపీ నాయకులు బోయ తిప్పేస్వామి, శెట్టూరు సర్పంచు కుమార్, టీడీపీ మండల కన్వీనర్ తిప్పారెడ్డి, మాజీ కన్వీనర్లు గురుప్రసాద్, నగేష్, రంగనాథ్, మాజీ జడ్పిటిసి ఆర్జి శివశంకర్, డిఎన్.మూర్తి, సిపిఐ నాయకులు జయరాములు,రవి, మంజు, రుద్రప్ప, కుటుంబ సభ్యులు ఈరన్న, రామాంజినేయులు, తిలక్, శ్రావణ్, నరసింహప్ప, నాగబూషణ్, విశాలాంధ్ర వలేకరులు తిప్పేస్వామి, మల్లికార్జున, రాజేష్, టివి-9 వలి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడుపై రాళ్లు వేయడం దుర్మార్గపు చర్య

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి

కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త : పట్టణంలోని ఉన్నం క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉన్నం మాట్లాడుతూ.. నందిగామలో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సభలో వైకాపా గూండాలు రాళ్లు విసరడం నీతిమాలిన చర్య అని, మా తెలుగు దేశం కార్యకర్తలు కడూఅ మీ వైకాపా గూండాల మాదిరిగా ఆలోచిస్తే మీకంటే బాగా రాళ్లు వేయగలరన్న విషయం గుర్తుంచుకోవాలి. మీ మంత్రులు, ఎమ్మెల్యేలు గడపగడపకు అంటూ తిరుగుతున్న మా కార్యకర్తలు ఎక్కడా కూడా అడ్డుకోవడం లేదంటే అర్థం చేసుకోవాలి, పోలీసులు కూడా చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ వాళ్లు ఏ కార్యక్రమం చేయాలన్నా 30 పోలీస్‌యాక్టు అని అడ్డుపడుతూ, కేసులు పెడుతున్నారు. అదే మంత్రి వందల మందితో మీటింగులు, కార్యక్రమాలు చేస్తే 30 యాక్టు వర్తించదా, పోలీసుల తీరు మార్చుకోవాలని హితవు పలికారు. వైకాపా గూండాలు తీరు మార్చుకోకపోతే తిరగబడుతామని హెచ్చరించారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు చెట్ల రుద్రప్పకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న ఉన్నం హనుమంతరాయ చౌదరి

కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త : శెట్టూరు మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు కమ్యునిస్టు పార్టీ సీనియర్ నాయకుడు చెట్ల రుద్రప్ప పార్థివ దేహాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కళ్యాణదుర్గం మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి సందర్శించి, నివాళులు అర్పించారు. ఉన్నంతోపాటు శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ మెంబర్ ఆర్జి శివశంకర్, శెట్టూరు మండల టీడీపీ కన్వీనర్ పాలబండ్ల తిప్పారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గురుప్రసాద్, మాజీ ఎంపిపి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కరిడిపల్లి రంగప్ప, అయ్యగార్లపల్లి మాజీ సర్పంచు నాగశెట్టి, పాలబండ్ల రామన్న, ఈరన్న, సీపిఐ తాలూక ప్రధాన కార్యదర్శి నరసింహులు, సిపిఐ మహాదేవ, బ్రహ్మయ్య, రామాంజినేయులు, ఆంజినేయులు, సత్తి ధనుంజయ ఉన్నారు. ఈ సందర్భంగా పెద్దాయన మాట్లాడుతూ.. చెట్ల రుద్రప్ప, ప్రజా సేవలో స్వాతంత్ర్య సమరయోధుడి, సర్పంచు కమ్యునిస్టు పార్టీ నేతగా ప్రజలకు అందించిన సేవలు కొనియాడుతూ చెట్ల రుద్రప్ప పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## దాహం తీరుస్తున్న కార్మికులకు దారి చూపరా..?

తాడిమర్రి, నవంబర్ 5 ప్రభాతవార్త : అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీటి సరఫరాను కల్పిస్తున్న వందలాది గ్రామాల్లోని ప్రజలకు దాహరం తీరుస్తున్న సత్యసాయి కార్మికులకు జీతాల చెల్లింపులో తీరని అన్యాయం చేస్తున్నారంటూ శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి నీటి సంపు వద్ద జరుగుతున్న కార్మికుల సమ్మె సభ్యులను జిల్లా సిఐటియు నాయకులు ఓబుల కొండారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి బాబా చొరవ వల్ల నేడు అనేక గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా నిరంతరాయంగా ప్రజలకు నీటి సరఫరా అందిస్తున్న సత్యసాయి కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అలాగే గ్రాడ్యుటీ, పిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. కార్మికులకు ఇఎస్ఐ లేకపోవడంతో వారు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు వారికి వైద్య సదుపాయం లభించడం లేదని, దీంతో సొంత ఖర్చులతోభరించాల్సి వస్తోందన్నారు. ప్రతి నెలా జీతంలో వైద్య సదుపాయం నిమిత్తం ఇఎస్ఐ నగదు కట్ చేస్తున్నారు కానీ వైద్య సదుపాయం అందించడం లేదన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం వద్ద ఒక సత్యసాయి కార్మికుడు ప్రమాదానికి గురికాగా ఇఎస్ఐ సదుపాయం ఉన్నప్పటికీ ఫోర్స్‌లో లేదంటూ అతని చేతి నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. 15 సంవత్సరాలుగా ఇఎస్ఐ కడుతున్నా, అవసరానికి ఉపయోగపడటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలన్నా, చెడ్డ పేరు రావాలన్నా, తాగునీటి సమస్య చాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి తాగునీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఉన్నా సత్యసాయి పథకం వల్ల ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డపేరు రావడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చొరవ తీసుకుని వందలాది కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాడిమర్రి మండల సిఐటియు వర్గంలోని కార్మికులందరూ పాల్గొన్నారు.


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఓబుల కొండారెడ్డి

## జలజీవన్ మిషన్ గురించి మండలస్థాయి అవగాహన సదస్సు

- గ్రామసభలు నిర్వహణ ప్రజలలో చైతన్యం ప్రధానం
- స్వచ్ఛమైన నీటిని త్రాగుదాం ఆరోగ్యంగా జీవిద్దాం
- వర్షపునీటిని ఒడిసి పట్టుదాం రేపటితరాన్ని ఆదుకుందాం


జలజీవన్ మిషన్ గురించి మాట్లాడుతున్న ఇసిహెచ్‌ఓ సంస్థ సిఇఓ హుస్‌మాన్

కుందుర్పి, నవంబర్,5, ప్రభాతవార్త : ఏడ్యుకేషన్ కల్చరల్ అండ్ హెల్త్‌ఆర్గనైజేషన్ సంస్థ అధ్వర్యంలో జలజీవన్ మిషన్ గురించి మండలస్థాయి అవగాహన సదస్సును ఎపి రాష్ట్ర గ్రామీణ నీటి సరపరా మరియు పారిశుధ్య విభాగం జలజీవన్ అధేశాలు మేరకు మండలంలోని గ్రామ సర్పంచులకు సెక్రటరీలకు జెడ్పిటిసి యంపిపి యంపిటిసిలకు ఇంజనీంగ్ అసిస్టెంట్లకు ఇంటింటికి కోళాయి పథకం గురించి హర్‌ఘర్‌జల్ కార్యక్రమం ద్వారా మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనంలో జలజీవన్ మిషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ హుస్‌మాన్ యంపిడిఓ నారాయాణస్వామి అర్‌డబ్లూయస్ ఏఈ జైపాల్ జెడ్పిటిసి బి రాధాస్వామి పాల్గొన్నారు ఈసందర్భంగా యంపిడిఓ నారాయణస్వామి మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాలకు జలజీవన్ మిషన్‌ద్వారా ప్రతి ఇంటికి కొళాయిలు కేంద్ర రాష్ట్ర నిదులతో ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని తెలిపారు జెజెయం ఇసిఓ కె హుస్‌మాన్ మాట్లడతూ ప్రతి పంచాయితిలో 15మందితో కమిటీలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ చైర్మన్‌గా వుంటాడని కార్యదరి ప్రముక పాత్రవహించ వలసి వుంటుందన్నారు కమిటీలకు శిక్షణకూడా అవసరం అన్నారు 50శాతం మహిళలు ఇందులో వుంటారని పేర్కొనా న్నరు ప్రతిగ్రామంలో గ్రామ సభలు నిర్వహించి మార్పుతీసుకొని రావాలని కొళాయి పన్ను వసూలు చెయ్యవలసి వుంటుందున్నారు జెడ్పిటిసి బి రాధాస్వామి మాట్లడతూ ప్రతి గ్రామంలో నీటిపై అంచనాలు వేసి అదనంగా ఓవర్ హెడ్ ట్యాంక్స్ ఏర్పాటు చెయ్యాలని 2019సం,లోప్రారంభిచినా నిదుల లోపంతో మందకొడిగా పనులు జరుగుతున్నావని అవేదన వ్యక్తపరిచారు ఈకార్యక్రమంలో సంస్థ సిబ్బంది సురేష్ దోణతిమ్మ మదుబాబు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక


మాట్లాడుతున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

శెట్టూరు, నవంబర్ 5 ప్రభాతవార్త : మండలంలో 16 గ్రామ పంచాయితీలలో 2020-21, 2021-22 రెండు ఆర్థిక సంవత్సరము లకు సంబంధించి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 14, 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఏర్పాటు చేసిన తనిఖీ బృందం వారు గుర్తించిన అంశములను ప్రిసైడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, డ్వామా విజిలెన్స్ అధికార రమణారెడ్డి, ఎపిడి రమేష్ నాయక్, ఎంపిడిఓ హాజరయిన తనిఖీ బృందం వారు గుర్తించిన వాటిని పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో 59,109, పంచాయితీ రాజ్ విభాగం 1,30020 కలిపి మొత్తం 1,89,129 మొత్తం రికవరీకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిటిసి మంజునాథ్, ఎంపిపి లక్ష్మీదేవి, సోమనాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ గ్రామాల నుంచి ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బంది హాజరు కావడం జరిగింది.

## కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

-వాల్ పోస్టర్ల విడుదలలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి


కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలు ఈనెల 21, 22 తేదీల్లో గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరుగుతాయని కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రంగారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో శనివారం ఆయన సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్, రైతు సంఘం తాలుకా కార్యదర్శి బి.జ్ఞానమూర్తి తదితరులతో కలిసి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభలో చర్చించి ఉద్యమ కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు ఆల్ ఇండియా కిసాన్ మహాసభ అధ్యక్షుడు విజ్జు కృష్ణన్ హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు నాగరాజు, బసవరాజు, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొలాలకు వెళ్లే దారికి అడ్డువేయించిన వారిపై చర్యలు తీసుకోండి

-తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్యకు విన్నవించిన రాకెట్ల తండా గిరిజనులు


వినతిపత్రం అందిస్తున్న రాకెట్ల తండా ప్రజలు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త : తమ పొలాలకు వెళ్లే దారికి అడ్డు వేయించిన వారిపై చర్యలు తీసుకొని దారిని పునరుద్ధరించాలని కోరుతూ మండల పరిధిలోని రాకెట్ల తండా గ్రామానికి చెందిన బాధిత గిరిజనులు వేడుకొంటున్నారు. శనివారం వారు రాకెట్ల మాజీ సర్పంచ్ యం.అశోక్‌కుమార్‌తో కలిసి ఈ మేరకు పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితులు ఆర్.శ్రీనివాసులు నాయక్, నారాయణస్వామి, రామప్రసాద్, శ్రీనివాసులునాయక్ తదితరులు మాట్లాడుతూ రాకెట్ల, రాకెట్ల తండా గ్రామాలకు చెందిన గిరిజనుల 30 కుటుంబాలకు ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నసమయంలో 80 ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. నాటి నుండి ఆ భూమి సాగుచేసుకొంటూ జీవనం సాగిస్తున్నామని అయితే రాకెట్ల తండాకు చెందిన జయరామ్‌నాయక్, రామస్వామినాయక్, శాంతమ్మ, తిరుపాలు, శ్యాములమ్మ, హనుమంతులు మాపై కక్షతో మా పొలాలకు వెళ్లే దారి లేకుండా జేసీబీతో పెద్దపెద్ద రాళ్ల అడ్డుగా వేయించి గుంతకలు తీయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకొని దారికి వేసిన అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు.

04ATP13_04ATP13.qxd 05-11-2022 PM 10:25 Page 1



# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జయంతోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

## -ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్సోవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త**

నియోజకవర్గంలోని కూడేరు మండలం ముద్దలాపురం గ్రామంలో శనివారం జరిగిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జయంతోత్స వం, శ్రీ ఈశ్వరమ్మ మాలధారణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గ్రామానికి చేరుకోగానే స్థానిక ప్రజలు, గురుస్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అమ్మవారి మాలదారులతో కొద్దిసేపు ముచ్చటించి మాలధారణ గూర్చి అడిగి తెలుసుకున్నారు.

# తక్కువ వడ్డీకే రైతన్నలకు బంగారు రుణాలు

## - ఏడిసిసి బ్యాంకు చైర్మన్ లిఖిత



సమావేశంలో మాట్లాడుతున్న ఏడిసిసి బ్యాంకు చైర్మన్ లిఖిత

**అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త**

ఎడిసిసి బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు బంగారు రుణాలు పంపిణీ చేస్తున్నట్లు ఏడిసిసి బ్యాంకు చైర్మన్ లిఖిత పేర్కొన్నారు. ఏడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం బ్రాంచుల సిబ్బందితో చైర్మన్ లిఖిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతులకు మెరుగైన సేవలు అందిచాలన్న లక్ష్యంతో తమ పాలక వర్గం పనిచేస్తోందన్నారు. అందులోభాగంగా తక్కువ వడ్డీకే రుణ సౌకర్యంతోపాటు అర్హులైన రైతులందరికీ రుణ సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. త్వరలోనే 2వీలర్, ఫోర్ వీలర్ వాహన సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. ఏడిసిసి బ్యాంకుల ద్వారా అందించే సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా నిర్దేశిత లక్ష్యాలను గుర్తు చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖ రాణి తదితరులు పాల్గొన్నారు.

# వీరాపురంను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధికి కృషి చేయాలి




మాట్లాడుతున్న సెంట్రల్ టీం డెహ్రాడూన్‌కు చెందిన జ్యూరి సభ్యులు డాక్టర్ శృతిశర్మ, ఢిల్లీకి చెందిన ఎకె గుప్తాలు

**చిలమత్తూరు, నవంబర్ 5 ప్రభాతవార్త**

జీవ వైవిద్యంలో ఆదర్శంగా వున్న సైబీరియన్ పక్షుల వలస కేంద్రం వీరాపురంను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అందుకు తాము కూడా సహాయ సహకారాలు అందిస్తామని సెంట్రల్ టీం డెహ్రాడూన్‌కు చెందిన జ్యూరి సభ్యులు డాక్టర్ శృతిశర్మ, ఢిల్లీకి చెందిన ఎకె గుప్తా అన్నారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో ఉత్తమ జీవ వైవిద్య యాజమాన్య కమిటీగా నామినేట్ అయిన సందర్భంగా క్షేత్రస్థాయిలో శనివారం వీరాపురంలో పర్యటించడానికి విచ్చేశారు. రష్యాలోని సైబీరియన్ ప్రాంతం నుండి వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకునే పక్షులను సంరక్షిస్తూ తమతో మమేకమై ఆదర్శవంతంగా సరికొత్త జీవవైవిద్యాన్ని పెంపొందిస్తున్న బిఎంసి కమిటీ కృషి ఎనలేనిలేద న్నారు. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిద్య మండలి ద్వారా 2008లో ఏర్పడిన కమిటీ స్వశక్తితో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సహకారంతో పక్షులను సంరక్షించ డం, ఆహారం అందించడం, నీటి నిల్వలకు కుంటలు ఏర్పాటు, మొక్క ల పెంపకం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో ఇంత ప్రగతి సాధ్యమై నామినేట్ చేయడం జరిగిందన్నారు. అయితే పర్యాట కంగా కూడా అభివృద్ధి చేస్తేనే మరింత విస్తృతమైన వనరులు సమకూరుతాయన్నారు. అయితే పక్షులను మరింత సంరక్షణ చేయడానికి కేంద్రం సహకారం అవసరమని కమిటీ సభ్యులు జ్యూరి టీం విన్నవించారు. ఆ మేరకు ప్రయత్నాలు చేస్తామని వారు హామి ఇచ్చారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర జీవవైవిద్య మండలి రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వరలక్ష్మి, ఎంపిడిఒ రామ్‌కుమార్, అటవీశాఖ అధికారులు, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తంరెడ్డి, వీరాపురం సర్పంచు లక్ష్మీపతిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, వేణు, కార్యదర్శి కేశవమూర్తి, సచివాలయం సిబ్బంది విశ్వనాథ్, నజ్జు, స్థానిక జీవ వైవద్య పక్షుల సంరక్షణ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# ముగిసిన ఇన్‌టెర్న్‌షిప్ కార్యక్రమం

**అనంతపురం, నవంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో**



సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఆర్ట్స్ కాలేజ్, అనంతపురం, కెఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ స్టూడెంట్స్‌కు 8వారాలపాటు ఇన్‌టర్న్‌షిప్ కార్యక్రమం రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనల శాలల శాఖ ఆధ్వర్యంలోనున్న ఎన్‌టిఆర్ ఆర్ట్స్ అండ్ కల్చర్ మ్యూజియం, పీఎస్ మెమోరియల్ హాల్ లో నేడు విజయవంతంగా ముగిసిందని పురావస్తు పరిశోధన ప్రదర్శన శాఖ సహాయ సంచాలకులు తెలిపారు. విద్యార్థులకు ఆన్‌సెట్ సీఈఓ, డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు నుంచి సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. సమావేశమునకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ఆన్‌సెట్ సీఈఓ ప్రసంగిస్తూ ముందుగా 8 వారాల కార్యక్రం విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తదుపరి భవిష్యత్తులో తమ కెరీర్‌గాఎంచుకున్న వాటిపై ఆన్‌సెట్ ఆధ్వర ంయలోశిక్షణ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామని పేర్కొన్నారు. విద్యార్థులందరూ తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం హాజరైన విద్యార్థినీ, విద్యార్థులందరికీ ఆన్‌సెట్ సీఈఓ అండ్ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ, అనంతపురం సహాయ సంచాలకులు వి.రజిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ రామాంజినేయులు, ఆర్ట్స్ కాలేజ్ అండ్ కెఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ అధ్యాపక బృందం, కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్, జిఎస్‌టి ఇన్స్‌పెక్టర్ ఎస్‌టి శ్రీనివాసులు, స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్, సీనియర్ ఆడిటర్ సి.పాల్, శాఖ సిబ ంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

# అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ పోలీసులతో టెలీ కాన్ఫరెన్స్

**అనంతపురం క్రైం, నవంబర్ 5 ప్రభాతవార్త**

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని సిఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ శనివారం కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 12వ తేదిన జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో కాంపౌండబుల్ కేసులన్నింటినీ డిస్పోజల్ చేసేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 7800 యూఐ కేసులు, శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న 13000 యూఐ కేసులలో ఈ నెలాఖరు కల్లా 80 శాతం తగ్గించాలన్నారు. గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ యూఐ కేసుల్లో అరెస్టులు, దర్యాప్తులు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేసి చార్జిషీట్లు చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 2వేల ఎక్సైజ్ కేసులు, శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న 5,600 ఎక్సైజ్ కేసులను తగ్గించాలన్నారు. వచ్చే నెలలో జరగనున్న లోక్ అదాలత్‌లో పిటి కేసుల డిస్పోజల్‌పై దృష్టి పెట్టాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీలు డా.పక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్ సింగ్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



వనభోజనాన్ని వడ్డిస్తున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

# కార్తిక మాసం.. వనభోజనాల ఏర్పాటు



పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం, నవంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో**

కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశి తులసి కళ్యాణోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని మంత్రి ఉషాశ్రీ చరణ్ ఇంట భక్తి శ్రద్దలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తులసి పూజ చేసి మహిళా నాయకులతో కలిసి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ వనభోజనాలు నిర్వహించారు.

# శ్రీరంగనాథస్వామిని దర్శించుకున్న ఆలూరు సాంబశివారెడ్డి



స్వామివారి దర్శనానికి వచ్చిన ఆలూరు సాంబశివారెడ్డి

**తాడిపత్రిరూరల్, నవంబర్ 5 ప్రభాతవార్త**

ప్రభుత్వ (విద్య) సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి శనివారం మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్, సిబ్బంది ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు శాలువాకప్పి పూలమాల వేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీచైర్మన్ ఆలూరు రామచంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది ఆదినారాయణరెడ్డి, కాశీం పాల్గొన్నారు.

# హత్య చేసిన నింధితులను వదలే ప్రసక్తే లేదు

## సత్యసాయి జిల్లా అదనపు ఎస్పి కె.వి రామకృష్ణ ప్రసాద్



సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ దృశ్యం

**అమరాపురం, నవంబర్ 5 ప్రభాతవార్త**

మండల పరిధిలోని హేమావతి గ్రామంలో పురోహితుడు శశిధర్ శర్మ (52 ) గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయడం విధితమే. హేమావతిలోని సంఘటనా స్థలాన్ని శనివారం సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణారావు సందర్శించి హత్య చేసిన స్థలంలో గుర్తులను పరిశీలించి అనంతరం హత్యకు గురైన శశిధర్ శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరలోనే హత్య చేసిన నింధితులను త్వరలో పట్టుకుంటామని వదలే ప్రసక్తేలేదన్నారు. హేమావతిలో జరిగిన హత్యను జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని.. సంఘటనలో స్థలంలో లభించిన ప్రాథమిక ఆధారాల ద్వారా మడకశిర సిఐ నాగరాజురావు నేతృత్వంలో ప్రత్యక బృందం రంగంలో దిగినట్లు.. నిందితులు తప్పించుకోలేరని ఎక్కడ ఉన్నా అదుపులోకి తీసుకుని చట్టం ద్వారా కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార క్రమంలో అదనపు ఎస్పీతోపాటు ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేసులు, కానిస్టేబుల్స్ అన్వేష్ రఫీక్‌లు పాల్గొన్నారు.

# మృతి చెందిన లక్ష్మికుటుంబానికి పరిహారంచెక్కు పంపిణీ



పరిహారం అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

**బొమ్మనహాళ్, నవంబర్ 5 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దర్గా హొన్నూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఆమిదాల లక్ష్మి (44) బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆమె భౌతిక కాయానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన చేసిన పరిహారం 10 లక్షల చెక్కును ఆమె భర్త ఆమిదాల వన్నప్పకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు తహశీల్దారు శ్రీనివాసులు, డిటి భోగన్న గౌడ్, ఎంపిపి యు.పద్మ, వైస్ ఎంపిపిలు కందేపల్లి రమేష్, శకుంతలమ్మ, కోఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా, జిల్లా స్టీరింగ్ క మిటీ మెంబర్ వన్నల్లి రామాంజినేయులు, దర్గాహొన్నూరు సర్పంచు శకుంతలమ్మ, ఎంపిటిసి శ్రీదేవి, నేమకల్లు సర్పంచు పరమేశ్వర, వైఎస్ఆర్‌సిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందవాడ ఎల్.లోకేష్, దర్గాహొన్నూరు రామకృష్ణ, మనోహర్‌శెట్టి, యల్లప్ప, వీరన్నగౌడ్, చిన్నరాయుడు, వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి ఎన్నికలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**గాండ్లపెంట, నవంబర్ 5, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో మండలం ప్రజా పరిషత్ కార్యాలయం నందు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు శాసన మండలి సభ్యులుగా వెన్నపూస రవీంద్రారెడ్డిని మరియు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులుగా ఎంవి రామచంద్రారెడ్డిని వైకాపా పార్టీ సానుభూతిపరులుగా ప్రకటించారని తెలిపారు.

జగన్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్నటువంటి అభివృద్ధిని మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి ఓటర్లకు వివరించాలన్నారు. ఓటు నమోదుకు 2019 అక్టోబర్ 31వ గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటను నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల నందు పనిచేసు ్తన్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓట్లను నమోదు చేయించాలని సూచించారు. కేవలం రెండు రోజుల కాలవ్యవధి మాత్రము ఉన్నదని, నవంబర్ 7వ తేది చివరి తేది కావున ప్రతి ఒక్క ఓటరును గుర్తించి తప్పనిసరిగా ఓటును నమోదు చేయించాలన్నారు. ప్రతి ఒక్క వైకాపా కార్యకర్త జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచిన శాసనమండలి అభ్యర్థులను అఖండమైన మోజారిటీతో గెలిపించుకోవడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్తి వెన్నపూజ రవీంద్రారెడ్డి తమ్ముడు వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలలో అర్హత కలిగిన పట్టభద్రుల అభ్యర్థులను గుర్తించి వారి చేత ఓటు నమోదు చేయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి జగన్‌మోహన్, మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు రహంతుల్లా, సుధాకర్‌రెడ్డి, ఆంజినేయులు, ఎంపిటిసిలు మహమ్మద్ ఇక్బాల్, సోమశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ, గజ్జల రవీంద్రారెడ్డి, గజ్జల సిద్దారెడ్డి, సికిందర్, ఫారూక్, వివిధ శాఖల చైర్మెన్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

## -మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



కుటుంబసభ్యులకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల

**గోరంట్ల, నవంబర్ 5 ప్రభాతవార్త**

మండలంలోని కొండాపురం పంచాయతీ హిందూపురం వయా కదిరి చలమయ్యగారిపల్లి వద్ద గురువారం సిమెంట్ లారీ ఢీ కొన్న ప్రమాదంలో మండలంలోని కమ్మలవాండ్ల పల్లికి చెందిన వైసిపి కార్యకర్త బాలరాజుతో పాటు సోమశేఖర్ ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ శనివారం కమ్మలవాండ్లపల్లి గ్రామానికి చేరుకుని మృతుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యేతో పాటు జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి సుకన్య, విజయసింహారెడ్డి, సర్పంచులు ప్రభావతి, ఆది, సరోజానాగేనాయక్, వైశాలి, జయశంకర్‌రెడ్డి, వైసిపి నాయకులు వెంకటేష్, గంగాద్రి, రంగప్ప, రమణప్ప, మధుసూదన్‌రెడ్డి, బాబురెడ్డి, స్కూల్‌చైర్మన్ శీన అగ్రి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, బాబురెడ్డి, గోరంట్ల మండలంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పరామర్శించారు.

# ఎవరికీ పట్టని బీసీ సంక్షేమ వసతిగృహం విద్యార్థుల కష్టాలు..!

## -ప్రతి గదిలోనూ పెచ్చులూడి పడుతున్న పైకప్పు -పగలు, రాత్రి దోమల బెడదతో తప్పని కష్టాలు -నిరుపయోగంగా బాత్‌రూములు, ఆరుబయటే స్నానాలు







పైకప్పు పెచ్చులూడి పడుతున్న దృశ్యాలు , కిటకీలకు దోమలు రాకుండా వేసిన మెష్ చిరిగిపోయిన దృశ్యం,

**ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త**

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని ఇందిరానగర్‌వద్దగల బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు పడుతున్న కష్టాలు ఎవరికీ పట్టడంలేదు. 1977లో ఇక్కడ వసతిగృహాన్ని నిర్మించినట్లు తెలుస్తుండగా భవనాలన్నీ శిధిలమైపోగా ప్రతి గదిలోనూ పైకప్పు సిమెంటు పెచ్చులూడిపడి ఇనుప కడ్డీలు దర్శనమిస్తున్నారు. ఉన్నఫలంగా పెచ్చులూడి మీద పడుతుంటాయని గదుల్లో ఉండాలంటేనే భయంగా ఉంటుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. వసతిగృహంలో విద్యార్థుల కోసం నిర్మించి బాత్ రూమ్‌లు శిధిలమై నిరూపయోగంగా మారగా తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు ఆరుబయట స్థానాలు చేయాల్సి వస్తోంది. హాస్టల్‌లోని గదులకు కిటికీలు, తలుపులు కూడా సరిగ్గా పడవని కిటికీలకు దోమలు రాకుండా వేసిన మెష్ మొత్తం చిరిగిపోయిందని దీంతో పగలు, రాత్రి దోమలతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. వసతిగృహం ఇంత అధ్వాన్న పరిస్థితుల్లో ఉండి దాదాపు 60 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా జిల్లా అధికారులు వసతిగృహాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వసతిగృహానికి రెగ్యూలర్ వార్డెన్ సైతం లేకపోగా బాలికల కళాశాల వసతిగృహం వార్డెనే ఈ వసతిగృహానికి ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. శిధిలమైన భవనాల పైకప్పు పెచ్చులూడిపడి విద్యార్థులు గాయపడే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తుండగా ఆరుబయట స్నానాలు, పారిశుద్ధ్య లోపం కారణంగా రోగాలు కూడా పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స ్పందిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.